# శత్రువులు

పదిహేను నిమిషాలలో మా ఇద్దరి మధ్యా చాలా తక్కువ సంభాషణ జరిగింది...పదేసి వాక్యాలుకూడా ఒక్కొక్కరం మాట్లాడిఉండం...మధ్యమధ్య నేను అవతలి గదుల్లో నా సామాన్ల పేకింగ్ చూసేందుకు రెండుమూడుసార్లు వెళ్ళి వొచ్చాను.

"మీరు వెళ్ళిపోవడం నాకు విచారంగా ఉంది".

ముఖం గంభీరంగా పెట్టి శర్మ అన్నాడు-నాకు చిరాకు వేస్తోంది! కాఫీ త్రాగించడం అయింది. నా ట్రాన్సఫర్ గురించి వివరంగా చెప్పడం అయింది. కాని, అతని పని-అదేమిటో నాకు తెలీదు...అతనికీ తెలీదులా ఉంది-అయినట్టు లేదు.

జవాబివ్వకుండా ముఖం మరోవేపు తిప్పేను నేను.

"మీరు నా ఆతిథ్యం స్వీకరించాలి-రించాలి-కాని, ఒక్క సారి..."

చేతులు జోడించి, ప్రాణదానం కోరుతున్న నేరస్థుడి ప్రార్థనలాగ అతను అన్నాడు. చేతులూ, ముఖం, కళ్ళూ, నోరు-అన్నీ ఆ ఆహ్వానంలో పనిచేశాయి.

ఏమనాలో వెంటనే బోధపడలేదు నాకు-ఒంటరి రకం మనిషిని నేను...ఎంతో ఆప్తులైతే తప్ప ఎవరితోనూ అట్టే

కాలం గడపడం నేను నేర్చుకోలేదు...నా సంశయానికి అదొక్కటే కారణం కాదు. కాని...

అతను లేచి నిలబడ్డాడు.

హటాత్తుగా నా చేతులు పట్టుకుని, "మీరు కాదనటానికి వీల్లేదు, ప్లీజ్!"

అంత దగ్గరగా వొచ్చి, మాట్లాడుతుంటే నాకు అనిష్టంగా ఉంది...అదీకాక అతను మాట్లాడినప్పుడల్లా నేను ఊపిరి తీసుకోలేక పోయాను.

"ఈ రాత్రి...ప్లీజ్!"

రివాల్వరు గుండెలమీద పెట్టినా అంత డెస్పరేట్‌గా ఉండి ఉండదు నా పరిస్థితి!

"అలాగే..." అని చేతులు విడిపించుకుని, గాలికోసం ఉక్కిరి బిక్కిరి అయిన ఊపిరితిత్తులలోకి రెండుసార్లు గాలి పంపి, అంతలో జ్ఞాపకం వొచ్చి, "థాంక్స్!" అన్నాను.

"థాంక్స్...మీకు...సెలవు!" అని, అతను తొందరగా వెళ్ళిపోయాడు-ఆ రిలీఫ్ పూర్తిగా నాకు అవగతం అయే లోపునే మళ్ళీ వొచ్చి, "నా అడ్రస్-కార్డు ఉంచండి...అప్పుడిచ్చిన కార్డుకాదు సుమండీ! ఇది కొత్త అడ్రసు!" అన్నాడు.

కార్డు తీసుకున్నాను.

"మీ శ్రీమతిగారు కూడా ఉంటే బాగుండేది!... కానివ్వండి- అన్ని అదృష్టాలూ ఒక్కసారి ఎలాగ వొస్తాయి?" అని, అతను మళ్ళీ త్వరగా వెళ్ళిపోయాడు.

నేను కుర్చీలో కూర్చుని, ద్వారంవైపు చూస్తూ, సిగరెట్ వెలిగించుకున్నాను.

శర్మ సంగతి.

అతనెవరో నాకు సరీగా తెలీదు...ఏదో వ్యాపారం.

విచిత్రంగా కలిశాడు— సంవత్సరం క్రిందట... ఒక రోజు.

అప్పటికి వారం రోజులునుంచి నా టెలిఫోనుకి జవాబివ్వకుండా, నాకు కనిపించకుండా నన్ను నానా బాధలూ పెట్టి, నా నిరాశ చరమస్థాయి చేరుకుంటున్న సమయంలో గీత టెలిఫోన్ చేసింది-ఆ రోజు.

"హల్లో!" అంది.

"హల్లో!" అన్నాను...గుండె గంటలు కొడుతూంది-గీతకి ఎన్ని మాటలు చెప్పాలనుకున్నానో, కాని గొంతుక ఎండిపోయింది.

"బాగున్నారా?"

ఆమె గొంతుక ఎన్నో జ్ఞాపకాలు తెస్తోంది...కాని, జరుగుతున్నది తెలియడంలేదు.

"మాట్లాడరా?"

ఏమనేది? కెరటాలు ఎగసి ఎగసి వొచ్చేస్తూంటే, చిన్న గిన్నెలో వాటి నెలాగ దాచడం? ఆలోచనల పెను గాలులని నేనెలాగ చిన్న చిన్న మాటల్లో పెట్టేది?

"సాయంత్రం సముద్రం చూడాలనిపించింది... మీకు చాలా పనులుంటయి కదా! ఒకసారి నెహ్రూనగర్ వెళ్ళి రండి!"

"గీతా!" అన్నాను. ఇలాటి పిలుపులకి అర్థం ఉండదు— పది అర్థాలు ఉంటాయి.

వెండి మువ్వల గలగల లాగ నవ్వి డిస్కనెక్ట్ చేసింది గీత. మళ్ళీ డయల్ చేశాను. ఎంగేజ్డ్ సిగ్నల్.

అదన్నమాట... సంగతి!

ఒక్కసారి...ఒకే ఒకసారి నేను కారు కోసం వెళ్లేను ... ఆమె ఇంటికి- నెహ్రూనగర్‌లో. గీతకి ఎలాగ తెలిసిందో!

"నా కెందుకు మీ వివరాలు? — మీ ఇష్టం వొచ్చిన వాళ్ళతో తిరగండి" అంటూవుండేది గీత... రోజు కొకసారి అయినా...

"అందుకే నీతో—"

"మనిషి నిలువెల్లా అబద్ధాలే!" కోపంతో అని, రెండు మూడు నిమిషాలు మాడ్లాడేది కాదు.

"చూడు గీతా!... ఈ కోపాలూ కలహాలూ— అన్నీ తీరడానికి ఒకే ఒక విషయం" అని నేనంటే, "ఓ!— ఇంతకి పరీక్షలౌతాయి. అయినా, మీలాటి మనిషి నా కొద్దు బాబూ!" అనేది గీత... నవ్వకుండానే.

"ఏం? నాలో లోపం ఏమిటి?" అని అడిగాను ఒకసారి... ఏ మగవాడికైనా ఆ మాత్రం కోపం రావడం సహజం.

"మీ లోపాలు– ఎన్నని చెప్పేది? మిమ్మల్ని కట్టుకుంటే అహోరాత్రాలు కాపలాకాయడం నా తరంకాదు. అయినా చెప్పినట్టు వినేవాడు కావాలి నాకు... మీలాటి పెంకివాళ్ళా? వొద్దుసార్! థాంక్స్" అంది గీత.

అందులో హాస్యం ఏమీలేదు.

అబద్ధాలుచెప్పే అలవాటు లేదామెకి.

ఆ సాయంత్రం ఐదు అయేసరికి మా మామూలుచోటుకి వెళ్లాను. ఆ చెట్టుక్రింద ఎన్నిసార్లు కలుసుకున్నామో! కాని, ఆ సాయంత్రం ఆమెకోసం మరీ కోరికతో, ఆత్రతతో చూశాను.

పది నిమిషాలలో ఆమె వొచ్చింది.

కాని, ఆమె మలయ మారుతంలాగా రాలేదు— ఝుంఝూ మారుతంలాగా వొచ్చింది.

ఇలాటి విషయాలలో కొంత అనుభవంవున్న మనిషిని నేను— ఈ వేడి తరవాతనే చల్లదనంలో సుఖం అనీ, కారం కారంగా కలహం కొనసాగేకనే తియ్యటి సామరస్యపు రుచి అనీ తెలుసును.

అందుకే, ఆమె రుసరుసలాడుతూ వొచ్చి కూర్చోగానే నేను మాట్లాడలేదు. మండుతోన్నదానిలో మరికొంచెం వేస్తే, అది మరో అందం...

కోపంలో గీత మరీ బాగుంటుంది.

చివరికి, "ఏం మాట పడిపోయిందా?" అంది గీత.

నేను అనేక భావాల చిరునవ్వొకటి నవ్వి ఊరుకున్నాను.

"ఏం? మాటలన్నీ కాంతిదగ్గరే మరచిపోయారా?" అంది గీత.

సరసమూ, విరసమూ, వివరంగా తెలుసుకోవడమూ, వాటిలో ఎక్కడిదాకా వెళ్లాలో, ఎక్కడ ఆగాలో అవగాహన చేసుకోవడమూ బుద్ధిమంతుడి లక్షణం.

నాకు ఆ సాయంత్రపు ఆ నిమిషాలలో అంతా సరసంగానే కనిపించింది. గీత నా పక్కనవుండి నా మనస్సుని ఉరకలు వేయిస్తోంది.

"కాంతి పేరు వినేసరికి అబ్బాయిగారికి ఉన్న మతీ పోయింది!" అంది కొంచెం తక్కువ కోపంతో గీత.

చిరునవ్వుతో, "కాంతి నిజంగానే చాలా మంచిదీ, అందమైనదీని!" అన్నాను.

"అలాగేం?" అంది గీత.

సరసంగా, "అవును...ముద్దొస్తూ ఉంటుంది" అన్నాను- ఆరిపోతోన్న నిప్పుని రాజవెయ్యడానికి.

మరుక్షణం నా చెంప నిప్పులాగా అయిపోయింది.

"గీతా!" అన్నాను అర్థంలేకుండా.

గీత ఇరవై అడుగుల అవతల ఉంది. ఆ ఆలోచన పూర్తి అయ్యేసరికి— నలభై.

కొద్దినిమిషాలు ఆలోచన సాగలేదు.

చెంప మండుతోంది...

"అయ్యో! క్షమించండి" అంటూ అతను వొచ్చి నా పక్కన కూర్చున్నాడు. ముప్పై ఉంటుందేమో వయస్సు. మామూలు మనిషిలాగా ఉన్నాడు.

ఆశ్చర్యంగా చూశాను.

"అంతా చూశాను — క్షమించాలి — అనుకోకుండా చూశాను—" అన్నాడు.

నేను కొంచెం ఎడంగా జరిగి కూర్చున్నాను. సముద్రపు గాలి ఉండవలసినంత బలంగా లేదు.

"అందగత్తె అంత గట్టిగా కొట్టగలదా అనిపిస్తుంది కదాండి! కాని, అందులోనే అందం ఉంది... సిగరెట్ కాలుస్తారా?"

అందించాడు. అందుకుని, వెలిగించాను.

"క్షమించండి ... కాని, నక్షత్రంలాగ మెరిసి వెళ్ళి పోయింది— అలాటి భార్య ఉన్నందుకు మీరు గర్వపడాలి!... స్వారిచేస్తే పంచకళ్యాణిమీద చెయ్యాలి... దెబ్బతిన్నా పంచకళ్యాణి దగ్గర తినాలి... కుంటిగుర్రం ఎక్కినా, దానిమీంచి పడినా అవమానమే సుమండీ!" అతను మరో దమ్ము పీల్చేడు.

ఎందుకో నాకు తెలీదుగాని, తన భార్యని ఎవరైనా గర్ల్‌ఫ్రెండ్ అనుకుంటే కలిగే ఆనందానికి సమానమైన ఆనందం తన గర్ల్‌ఫ్రెండ్‌ని ఎవరైనా భార్య అనుకోడం. నా చెంప మంట తగ్గడం ప్రారంభించింది.

"భార్యా రూపవతీ శత్రుః అన్నవాడికి భార్య లేకుండా అయినా ఉండాలి. వాడి భార్య కురూపి అయి అయినా ఉండాలి— అలాటివాళ్ళకి మనలాంటివాళ్ళని చూస్తే జెలసీ అండీ!"

అతనితో సంభాషణ బలే హాయిగా ఉంది! నేను మాట్లాడక్కర్లేదుగా!

"వాళ్లు మనల్ని రోజంతా ఎన్నిచెరువుల నీళ్లు తాగిస్తే ఏం అండీ? అ తరవాత... మీకు చెప్పాలా స్వామీ!... ఆ తర వాత ఆ మధురక్షణాలు..."

అతను తన్మయుడై పోయాడు కామోసు... కెరటాల వొంక అలా చూస్తూ ఉండిపోయాడు.

కొంచెం సేపటి తరవాత... "మరి వెళ్లివస్తానండీ!— ఇంతకీ మీ పేరు—"

చెప్పేను. అతను కొంచెం నలిగిన ఒక కార్డు తీసి ఇచ్చి "నా పేరు శర్మ..." అని మొదలుపెట్టి అన్ని వివరాలు అనవసరంగా చెప్పి వాచీ చూసుకుని... "మీ అంత సరసంగా కాకపోయినా, మా శ్రీమతీ ఇవాళ కొంచెం కోపం తెచ్చుకుంది ...ఇక్కడ జరిగినదంతా చూశాక వెళ్లి మంచిచేసుకోవడం సమంజసంలాగ అనిపిస్తోంది... అలాగ పూల బజారుదాకా కావాలంటే నా స్కూటరుమీద తీసికెడతాను" అన్నాడు.

"నా స్కూటరు ఉందిలెండి" అన్నాను.

"గుడ్ గుడ్... ఓ నాడు మా శ్రీమతీ మీ శ్రీమతీ కలిస్తే, చూసేవాళ్ళకి రెండు కళ్ళు చాలవు!... క్షమించండి-

ఒకరోజు ఎలాగో ఏర్పాటు చేద్దాం..." అని శర్మ వెళ్ళి పోయాడు.

ఆ తరవాత అతను ఒకటి రెండుసార్లు సినీమా హాలు దగ్గరా, కొన్నిసార్లు హోటళ్ళలోను కనిపించాడు...కాని, భార్యా సమేతంగా ఎప్పుడూ కనిపించలేదు. ఒకసారి నా ఆఫీసుకే వొచ్చాడు. ప్రతీ విషయాన్ని తన శ్రీమతి అందానికి ఎలాగో దగ్గరగా తెచ్చేవాడు. అయితే, ఆమెని గురించి మాట్లాడేటప్పుడు అతనిలో కలిగే తన్మయత్వం చూడ్డానికి ఖలే సరదాగా ఉండేది. మేం కలుసుకున్నప్పుడల్లా ఇది మామూలు. అతను వెళ్ళిపోయేటప్పుడు, "ఒక్కసారి మా ఇంటికి రావాలి మీరు...క్షమించండి-కాని నా ప్రార్థన మన్నించాలి... మీ శ్రీమతిగారు బాగున్నారా?...మరేమి..." అని నాన్చేసి, చిరునవ్వుతో వెళ్ళిపోయేవాడు.

కొంచెం శంకించే స్వభావం నాది—

అతని తన్మయత్వమూ, అతను నాకెప్పుడూ ఒంటరిగానే జతపడడమూ, నన్ను ఇంటికి పిల్చినప్పుడల్లా లాంఛనంగా పిలవడమేగాని స్పష్టంగా సమయనిర్దేశం చెయ్యాకపోవడమూ నాకు ఒక చిన్న అనుమానాన్ని కలిగించేయి.

విషపు మొక్కలు వేగంగా ఎదుగుతాయి.

అందుకే త్వరలోనే నా అనుమానం ఒక నిశ్చయమైపోయింది-అతని భార్య చాలా కురూపి అయిఉండాలి...

ఉండీ ఉండీ నేను మానవ మనస్తత్వాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటాను. గీత నాతో మాట్లాడ్డం మానేశాక,

ఆమె మనస్తత్వాన్ని గురించిన ఆలోచనలు ముగిసిపోయాక శర్మ మనస్తత్వాన్ని గురించి ఆలోచించి, నా విజ్ఞానానికి నేనే ఆశ్చర్యపోయాను.

కాని నా శంకా స్వభావానికి రెండుఅంచులు ఉన్నాయి.

అందుకే ఒకసాయంత్రం అతనిచ్చిన అడ్రసుకి వెళ్ళేను.

రెండు అంతస్తుల పాత ఇల్లు ఆ అడ్రసు. కార్డు మళ్ళీ చూస్తే, ఫస్ట్ ఫ్లోర్ అని రాసి ఉంది.

మీదికివెళ్ళి తలుపు తట్టేను,

ఒక నిమిషం ఏమీ జరగలేదు.

మళ్ళీ తట్టేను.

ఈసారి తలుపు ఒక్కసారి తెరుచుకుంది.

"ఎవరూ? అంది ఒక కంఠం...

"శర్మగారు ఉన్నారా?" అన్నాను ఆమెని చూడడానికి ప్రయత్నిస్తూ. ఆమె అందగత్తె అయితే, ఆ కంఠస్వరం ఆమె దురదృష్టం.

"లేరు..."

"వొస్తారా"?

"ఊరి కెళ్ళేరు...రెండు రోజుల్లో వస్తారు."

అనుకోకుండా ఆమె ఎదురుగా వచ్చి నిలబడింది. వయస్సుతప్ప ఆమెకి భగవంతుడు ఏమీ ఇచ్చినట్టు లేదు... మరోసారి చూడాలని అనిపించలేదు.

త్వరత్వరగా మెట్లు దిగి వచ్చేశాను. శర్మ విషయంలో నా విజ్ఞానాన్ని మెచ్చుకోవాలో, ఒక దురదృష్టవంతుడు చీకటి చీకటి కోణాల కోణాల్లో దాచుకున్న, దయనీయమైన ఒక అమాయిక రహస్యాన్ని బయటికి తెచ్చినందుకు నన్ను నేను అసహ్యించుకోవాలో నాకు బోధపడలేదు.

చాలాకాలం నాలో ఆ సంఘర్షణ రేగింది-అతను కనిపించినప్పుడల్లా చెయ్యరాని దేదో చేసిన బాధ నాకు సిగ్గు కలిగించేది.

మరో నెల తరవాత కాబోలు కలిశాడు...నా ఇంటికి వొస్తానన్నాడు.

"తప్పకుండా!" అని, అడ్రసిచ్చేను. నా ట్రాన్స్ఫర్ మాట చెప్పేను.

అతను వెళ్ళిపోయాక నాకు తెలివి వొచ్చింది...నా శ్రీమతి ఏదీ...? తీరా అతను వొస్తే,...

నా మూర్ఖత్వానికి నేనే నవ్వుకున్నాను.

అతను భార్యని తీసుకుని రాడుగా!

అదీకాక, ఒక నిజాన్ని ఋజువు చెయ్యడం కష్టంగాని పది అబద్ధాలని నమ్మించడం సులువు. శ్రీమతి పుట్టింటికి వెళ్లిందంటే సరిపోదూ?

చివరికి తను వొచ్చాడు..."క్షమించండి..." అంటూ ఇంటిచుట్టూ చూసి, శ్రీమతి లేని విషయం గమనించి, నన్ను ఆ రాత్రి వొచ్చేలాగ ఒప్పించి వెళ్ళాడు.

ఆ రాత్రి ఏడున్నరకి అతని కొత్త ఇల్లు కొంచెం కష్ట పడి వెతికి, చేరుకున్నాను. నాకు కొంచెం బిడియంగా ఉంది. ఆమెని మళ్ళీ ఎలాగ చూడగలనని...ఇలాగ బలవంతం చేసి నన్ను రప్పించినందుకు శర్మమీద చికాకు వేసింది.

గేటు తీస్తూంటే శర్మ తొందరగా వొచ్చి గడియతీసి, "స్కూటర్ లోపల పెట్టెయ్యండి..." అన్నాడు.

అలా గేచేసి అతని వెనకాల లోపలికి నడిచేను-ఏ రెండింటి మధ్యా పోలికలులేని ఐదు కుర్చీలు, రెండు బల్లలూ ముందు గదిని అలంకరించి దానిని డ్రాయింగ్ రూమ్‌గా చేశాయి.

"మీరు రావడం నాకు చాలా సంతోషంగా ఉంది..." అన్నాడు ఒక కుర్చీ నా కెదురుగా లాక్కుని కూర్చుంటూ, శర్మ.

నిశ్శబ్దంగా చిరునవ్వుతో జవాబిచ్చేను.

"ఏమిటో, మీదీ నాదీ ఒకే సమస్య కావడాన్న మన కెన్నాళ్ళనించో స్నేహంలాగ అనిపిస్తుంది నాకు...మీరు క్షమించాలి" అన్నాడు.

"దాని కేముందిలెండి!" అన్నాను.

అటు తిరిగి, "రాణీ...? రసంతే!" అన్నాడు.

నాలో ఆతృత ఎక్కువైంది...ఆరోజు నేను చూసిన మనిషి బహుశా ఇతని భార్య కాదేమోననే అనుమానం త్వర గానే నమ్మకగా మారిపోయింది...'రాణీ' ముద్దుపేరయి ఉండాలి-అమె ఎలా ఉంటుందో! ప్రతీక్షణమూ ఎంతోసేపటి లాగ అనిపించింది.

అటు గుమ్మానికి కట్టిన తెర తొలగించుకొని పదేళ్ళ పిల్ల రెండు గ్లాసులలో 'రసం' తెచ్చింది. బట్టలని చూస్తే పని చేసే పిల్లలాగ ఉంది.

"పది నిమిషాల్లో అన్నం పెట్టేమను..."

'రాణి' వెళ్లిపోయింది.

లోపల ఎక్కడో కుక్క గట్టిగా అరిచింది. తుళ్ళిపడ్డాను-మళ్ళీ ప్రస్తుతంలోకి వొచ్చాను. అతనేదో అంటున్నాడు. నాకు వినపడ్డంలేదు—సస్పెన్సులో మునిగి తేలుతున్నాను.

రసం చాలా ఘాటుగా ఉంది.

ఉప్పు ఎక్కువ లాగ ఉంది.

నేను పట్టించుకోలేదు. తాగేశాను.

ఆరు నిమిషాల్లో మళ్ళీ రాణీ వొచ్చింది..."అన్నం పెట్టేశారు అమ్మగారు" అంటూను.

లేచి లోపలికి వెళ్ళేము...చిన్న గదిలో టేబిలుపక్కన పోలికలులేని రెండు కుర్చీల్లో ఇద్దరమూ కూర్చున్నాము. వంట గదికి ఎదురుగాఉన్న కుర్చీలో శర్మ...అతని కెదురుగా నేను.

పదార్థాలన్నీ టేబిల్‌మీద అమర్చివున్నాయి.

భోజనం ప్రారంభించేము. మధ్యమధ్య అతను వంటగది వేపు చూచి ఏవో సంజ్ఞలు చేస్తున్నాడు... ఆ సంజ్ఞల తరవాత భోజన వస్తువుల్లో ఏమీ మార్పులు జరగకపోవడాన్న

వాటి అర్థం నాకు బోధపడక నా అనుమానాలూ ఆలోచనలూ మరింత ఎక్కువ అయాయి.

అతనెక్కువ మాట్లాడకుండా తినడం సాగించేడు— త్వరలోనే ఇద్దరమూ లేచి డ్రాయింగ్‌రూమ్‌లోకి వచ్చాము.

తమలపాకులు, వక్క తిని సిగరెట్ వెలిగించాను.

"ఎప్పుడు మీ ప్రయాణం?" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ శర్మ.

"నాలుగు రోజుల్లో..."

"ఎప్పుడైనా కలకత్తా వొస్తే తప్పక మీ దర్శనం చేసుకుంటాను".

సంగతులన్నీ అయిపోయి సెలవిస్తూన్నట్లు తెలిసి, లేచాను.

"కాఫీ తాగుతారా?"

"వొద్దు — థాంక్స్ — చాలా శ్రమపడ్డారు?" అన్నాడు.

దానికేవుంది! "మీరు రావటం మీ దయ" అన్నాడు.

వెళ్ళడానికి వెనక్కితిరిగేసరికి తలుపుపక్కగా చూశాను —పెద్ద ఫోటో. పెళ్ళిఫొటోలాగ ఉంది....వరుడు సూటులో ఉన్నాడు... శర్మ అవునో కాదో నమ్మకంగా తెలియలేదు. వధువు ముఖం మళ్ళా చూశాను... శర్మ మరో తమలపాకుకి సున్నంరాసి నోట్లోపెట్టుకుని నాతో గుమ్మందాకా వొచ్చాడు.

"సెలవు!" అన్నాను.

మీరు త్వరగా వెళ్ళిపోతున్నారు... కడుపు నిండిందో లేదో!" అన్నాడు శర్మ చేతులు జోడించి.

లోపలినించి కుక్క మళ్ళీ అరిచింది.

నేను కిటికీవైపు చూస్తూ స్కూటరు స్టార్టుచేసే ప్రయత్నంలో ఉన్నట్టు నటించేను. కిటికీలోనించి ఒక ముఖం క్షణికంగా కనిపించి, మాయం అయింది... ఈమె?...

ఎవరైనాసరే, ఆమె నేనానాడు చూసిన మనిషిమాత్రం కాదు... ఈమె ఎలా ఉంటుందో! ఆ సగం క్షణంలో నాకు ఆమె రూపం మరీ అస్పష్టంగా మాత్రమే కనిపించింది.

స్కూటరు స్టార్టయింది. నేను అతనివేపు చెయ్యి ఊపి బయలుదేరేను.

నాలో తీరని అసంతృప్తి.

శర్మ ఎందుకు పిలిచాడు నన్ను?

అతని భార్య ఎలాగ ఉంటుంది?

ఆ ఫొటోలో ఎవరు?

అసలతనికి పెళ్ళి అయిందా?

ఆ రోజు నేనుచూసిన దెవరిని?

ఆలోచించినకొద్దీ మరికొన్ని ఆలోచనలు రాసాగాయి—ఇల్లు చేరేసరికి నేనెటూ తెలియనిస్థితిలో పడిపోయాను. బాగా అలిసిపోయీ ఉన్నాను.

చాలాకాలందాకా శర్మనిగురించి ఆలోచిస్తానని తెలుసును— కాని, ఏమని? ఏమి జవాబులు వొస్తాయి?

ఆ జవాబులు నా తత్వంమీద ఆధారపడి ఉంటాయనీ నాకు తెలుసును. బహుశా ఇలాటి సమస్యలకి జవాబులు ఉండ వనిపించింది.

అదీ మంచిదే ననిపించింది.

నిద్ర వొస్తే బాగుండును.

★